VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 11 జూలై 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 348

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## అసెంబ్లీ సమావేశాల్లో మీడియాదే కీలకపాత్ర

ఉభయ సభలు సజావుగా సాగడానికి సహకరించాలి

మీడియా సలహా కమిటీ తొలి భేటీలో స్పీకర్ ప్రసాద్ కుమార్







## తుంగభద్రకు తగ్గిన ఇన్‌ఫ్లో

### 8 క్రస్ట్ గేట్లు మూసిన అధికారులు

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సత్తా చాటుదాం

**పార్టీ మైనార్టీ సెల్ సమావేశంలో హరీష్ రావు**

హైదరాబాద్: హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సత్తా చాటుదామని బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. మాజీ మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ హైదరాబాద్ మైనార్టీ విభాగం సమావేశాన్ని తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ తమది సెక్యులర్ ప్రభుత్వమని చెప్పుకొనే కాంగ్రెస్.. 20 నెలలు గడుస్తున్నా ఒక్క మైనార్టీనేతను మంత్రిగా చేయలేదన్నారు. హైడ్రా, మూసీ పేర్లతో రేవంత్ సర్కార్ ముస్లింల ఇళ్లను కూల్చి వారికి గూడులేకుండా చేసిందన్నారు. మైనార్టీల కోసం ఎన్నికల ప్పుడు హామీలు గుప్పించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక వాటి అమలును పట్టించుకోవడంలేదని విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ కు బుద్ధిచెప్పాలని మహమూద్‌అలీ, తలసాని, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మైనార్టీలను కోరారు.




## బెట్టింగ్ యాప్‌ల కేసులో రంగంలోకి ఈడీ

హైదరాబాద్: బెట్టింగ్ యాప్‌ల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ తరహా యాప్‌ల కోసం ప్రమోషన్ల వ్యవహారంలో మనీ లాండరింగ్ జరిగిందనే కోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రంగంలోకి దిగింది. 29 మంది సినీనటులు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(ఈసీఐఆర్) నమోదు చేసింది. ఈ కేసులో నిందితుల జాబితాలో సినీనటులు దగ్గుబాటి రానా, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి, నిధి అగర్వాల్, ప్రణీత సుభాశ్, అనన్య నాగళ్లతోపాటు టీవీ యాంకర్ శ్రీముఖి, శ్యామల తదితరులున్నారు. నిందితులు జంగిల్ రమ్మీ, జీత్‌విన్, లోటస్ 365.. తదితర బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్లు చేయడం వివాదాస్పదమైంది. వీరి ప్రమోషన్ల ప్రభావంతో పలువురు యువకులు బెట్టింగ్‌లో డబ్బులు పెట్టి మోసపోవడంతోపాటు కొందరు ఆత్మహత్యకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు రూ.వేల కోట్ల డబ్బు కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. ఆయా ఘటనల నేపథ్యంలో సినీప్రముఖులు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఐదు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఆయా కేసుల ఆధారంగా ఈడీ దర్యాప్తు ఆరంభించింది. ప్రమోషన్లు చేసినందుకు బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు హవాలా మార్గంలో పలువురికి డబ్బు పంపించారనే కోణంలో ఆరా తీస్తోంది. ఇప్పటికే తెలంగాణ పోలీసుల నుంచి ప్రాథమిక దర్యాప్తు వివరాలను ఈడీ సేకరించింది. త్వరలోనే నిందితులకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అవకాశం కనిపిస్తోంది.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో..

అందుకు అనుగుణంగా ఆర్డినెన్స్ ఆ తరవాత స్థానిక ఎన్నికల నిర్వహణ

తెలంగాణ కేబినేట్ కీలకనిర్ణయం వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం

# బీసీలకు 42% రిజర్వేషన్

హైదరాబాద్: తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అమలుకు ఆర్డినెన్స్ ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వీటి ఆధారంగానే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. కేబినేట్ విశేషాలలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వివరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలకు వెళ్తామన్నారు. రిజర్వేషన్ల అమలుకు 2018లో తెచ్చిన చట్టాన్ని సవరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. క్యాబినెట్ భేటీ ముగిసిన అనంతరం సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు,వాకిటి శ్రీహరితో కలిసి పొంగులేటి మీడియాతో మాట్లాడారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని మాట ఇచ్చామని.. ఈ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపామన్నారు. ఈ బిల్లుకు అనేక కొర్రీలు పెట్టారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో లీగల్ సమస్యలు రాకుండా



అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడామన్నారు. 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. డెడికేషన్ కమిషన్ ద్వారా రిజర్వేషన్ ప్రాసెస్ పూర్తి చేస్తుందని వివరించారు. 2018లో ఉన్న చట్టాన్ని ఆర్డినెన్సు ద్వారా సవరించాలని కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరినప్పటి నుంచి మొత్తం 19 కేబినెట్ సమావేశాలు జరిగాయని గుర్తు చేశారు. నేటి వరకు 23 శాఖలకు సంబంధించి 327అంశాలపై ఈ కేబినెట్లలలో చర్చ జరిగిందని వివరించారు. 321 అంశాలను కేబినెట్ ఆమోదించింద న్నారు. కేబినెట్ ఆమోదించిన అన్ని అంశాల అమలుపై ఈ రోజు సమావేశంలో చర్చించామని తెలిపారు. కేబినెట్ ఆమోదించిన 96 శాతం అంశాలు అమలులోకి వచ్చాయని వివరించారు.




## చైనాలో అధికార మార్పిడి తప్పదా

కొంతకాలంగా అజ్ఞాతంలోకి జిన్‌పింగ్

జిన్‌పింగ్‌ను తప్పించేపనిలో కమ్యూనిస్టులు

ప్రపంచవ్యాప్తంగా చైనా రాజకీయాలపై చర్చ




## ఢిల్లీ సహా ఉత్తరాదిలో స్వల్ప భూ ప్రకంపనలు



# కల్లులో ఆల్ప్రాజోలం..

## పలు దుకాణాల లైసెన్స్ రద్దు

హైదరాబాద్: నగరంలోని కూకట్‌పల్లి పరిధిలో జరిగిన కల్తీ కల్లు ఘటన నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఐదు బృందాలుగా ఏర్పడి వివిధ కల్లు దుకాణాల నుంచి నమూనాలను సేకరించి.. నారాయణగూడలోని ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించారు. కొన్ని దుకాణాల్లో ఆల్ప్రాజోలం మత్తుమందును కలిపి కల్లు కల్తీ చేసినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో పలు దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేసినట్లు బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

## కల్తీ కల్లు ఘటనలో

### బాధితుల సంఖ్య 44కి చేరిక: మంత్రి

హైదరాబాద్: హైదరాబాద్ కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో బాధితుల సంఖ్య 44కి చేరింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు- తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రస్తుతం నిమ్స్‌లో 31 మంది, గాంధీ ఆస్పత్రిలో ఆరుగురు చికిత్స పొందుతున్నట్లు- చెప్పారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో మరో ఏడుగురికి చికిత్స అందిస్తున్నట్లు- చెప్పారు. మంగళవారం కూకట్‌పల్లి పరిధిలోని పలు కల్లు కాంపౌండ్‌లలో కల్తీకల్లు తాగి పలువురు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే.



## కల్తీకల్లు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి

హైదరాబాద్: కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు, బాధితులకు రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. “కల్తీ కల్లు ఘటనలో అనధికారికంగా ఆరుగురు మృతి చెందారు. ఒకటి రెండు సీసాల కల్లు తాగిన వారి కిడ్నీలు దెబ్బతిన్నాయి. కల్తీ కల్లులో సైకో ట్రాఫిక్ సబ్ స్టన్స్ కలిపినట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఎక్సైజ్ శాఖ కల్లు కాంపౌండ్ వారితో కుమ్మక్కైంది. ఈ ఘటన మొదటిసారి కాదు.. గతంలోనూ వెలుగు చూశాయి. ఎక్సైజ్ అధికారులు రోజూ కల్లు కాంపౌండ్‌లలో తనిఖీలు చేయాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వంచర్యలు తీసుకోవాలి” అని రామచందర్‌రావు అన్నారు.




## సికింద్రాబాద్ బోనాల జాతర

రెండ్రోజుల పాటు వైన్స్ మూసివేత

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

## రైల్వేలపై కేంద్రం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: రైల్వేలపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఐదేళ్లలో కొత్తగా వెయ్యి రైళ్లను పట్టాలు ఎక్కించాలని భారతీయ రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం న్యూఢిల్లీలో వెల్లడించారు. రానున్న ఐదేళ్లలో ఈ కొత్త రైల్వే సర్వీసులు ప్రారంభిస్తామని అన్నారు. 2027 నాటికి దేశంలో బుల్లెట్ రైలు ప్రారంభించడమే భారతీయ రైల్వే లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. రైల్వే ఎగుమతులు ద్వారా ప్రపంచంలోనే భారత్ కీలక పాత్ర పోషించనుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక రైల్వే ద్వారా సరుకు రవాణాలో ఇది దేశానికే వెన్నుముకగా నిలవనుందన్నారు. గత 11 ఏళ్లలో దేశవ్యాప్తంగా 35 వేల కిలోమీటర్ల మేర కొత్త రైల్వే ట్రాక్‌ను నిర్మించామని వివరించారు. ఇది జర్మనీ దేశంలోని మొత్తం రైల్వే ట్రాక్‌తో సమానమని సోదాహరణగా చెప్పారు. ఒక్క ఏడాదిలోనే 5,300 కిలోమీటర్ల మేర ట్రాక్‌ను భారతీయ రైల్వే నిర్మించిందని చెప్పారు.ఏడాదిలో 30 వేల వ్యాగిన్లు, 15వందల లోకోమోటివ్ లను భారతీయ రైల్వే తయారు చేస్తుందని పేర్కొన్నారు. ఇది ఉత్తర అమెరికా, యూరప్ తయారు చేస్తున్న రైల్వే వ్యాగిన్ల కంటే అధికమన్నారు. మరోవైపు భారతీయ రైల్వేలో పెట్టబడులు రూ. 2 వేల కోట్ల నుంచి రూ. 2.25 లక్షల కోట్లు ఏగబాకాయని చెప్పారు. అందులో రూ. 20 వేల కోట్లు.. పీపీపీ ద్వారా అదనంగా వచ్చాయని ఆయన వివరించారు. జపాన్ సహకారంతో బుల్లెట్ రైలు తయారు చేస్తున్నామన్నారు. ఇది 2026 నాటికి పూర్తవుతుందని భావిస్తున్నామని తెలిపారు. 2027లో దీనిని ప్రారంభిస్తామన్నారు. ఇక ఏడాదిలో రైళ్లు పట్టాలు తప్పిన ఘటనలు 170 నుంచి 30కి తగ్గాయన్నారు. మొత్తంగా పరిశీలిస్తే.. రైలు ప్రమాదాలు 80 శాతం మేర తగ్గాయని వివరించారు. ట్రాకులు అప్ గ్రేడ్ చేయడం.. పాయింట్స్, సిగ్నలింగ్ వ్యవస్థలను ప్రతి రోజు సమీక్షించడం ద్వారా ఈ ప్రమాదాల నివారించడం సాధ్యమైందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వివరించారు.

## బ్రిడ్జి దుర్ఘటనలో
### 15కుపెరిగిన మృతుల సంఖ్య

గాంధీనగర్: ప్రధాని మోదీ స్వరాష్ట్రం గుజరాత్ లో ఘోర దుర్ఘటన జరిగింది. వడోదర జిల్లాలోని పద్రా పట్టణ సమీపంలో గల మహిసాగర్ నదిపై నిర్మించిన 40 ఏళ్ల పురాతన వంతెన బుధవారం ఉదయం కుప్పకూలిన విషయం తెలిసిందే. గంభీర బ్రిడ్జిలోని కొంత భాగం నదిలోకి పడిపోయింది. ఈ దుర్ఘటనలో మరణించిన వారి సంఖ్య తాజాగా 15కు పెరిగింది. ముగ్గురు వ్యక్తుల ఆచూకీ ఇంకా లభించ లేదని జిల్లా కలెక్టర్ అనిల్ ధమేలియా తెలిపారు. 'బ్రిడ్జి కూలిన ఘటనలో మరణించిన వారి సంఖ్య 15కు పెరిగింది. ముగ్గురు వ్యక్తులు గల్లంతయ్యారు. వారి కోసం సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయని తెలిపారు. 900 మీటర్ల పొడవున్న ఈ వంతెనలోని రెండు పిల్లర్ల మధ్య ఉన్న స్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలి నీటిలో పడిపోయింది. దీంతో ఆ స్లాబ్ మీద ఉన్న రెండు ట్రక్కులు, రెండు వ్యాన్లు, ఓ ఆటోరిక్షా, మరో బైక్ నీటిలో పడిపోయినట్టు– పేర్కొన్నారు. అప్పుడే స్లాబ్ చివరివరకూ వచ్చిన ఓ పెద్ద ట్యాంకర్ ప్రమాదకరంగా వేలాడిందని, మరో వాహనం కూడా ఇలాగే నిలిచిపోయిందని తెలిపారు. సెంట్రల్ గుజరాత్, సౌరాష్ట్రను గంభీర వంతెన కలుపుతుంది. తాజా ఘటనతో ఇరు ప్రాంతాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఇదిలావుంటే వడోదరలో గంభీర బ్రిడ్జి కూలిపోయిన ఘటనపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ఈ దుర్ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారన్న ప్రియాంక గాంధీ.. భారీ బ్రిడ్జి కూలడంపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద ప్రాంతంలో రెండవ రోజు కూడా సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ, అదే సమయంలో దర్యాప్తు కూడా జరగాలని ప్రియాంక గాంధీ అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా ఈ అంశంపై స్పందించారు. కేంద్రంలోని బిజెపి నాయకత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గుజరాత్ వంతెన కూలిపోవడం, అహ్మదాబాద్ విమాన ప్రమాదం వంటి ఇటీవలి విషాదాలు నాయకత్వ సంక్షోభం, అవినీతి, అసమర్థత ఫలితంగా జరిగాయని ఆరోపించారు.

## చైనాలో అధికార మార్పిడి తప్పదా

బీజింగ్:చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు అధ్యక్ష బాధ్యతల నుంచి తొలగిపోతున్నారన్న వార్త ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆయన అధికారం నుంచి తప్పుకోబోతున్నారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. కొంతకాలంగా జిన్‌పింగ్ బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉండటం, బ్రిక్స్ సమావేశానికి హాజరు కాకపోవడం ఈ అనుమానాలకు బలం చేకూర్చాయి. ఈ క్రమంలో చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ అధికారాన్ని వీడబోతున్నారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. నియంతృత్వ పోకడలతో చైనా మొత్తాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్న జిన్‌పింగ్ ఇప్పుడు ఎందుకు అనూహ్యంగా తప్పుకుంటున్నారన్నది అంతు చిక్కట్లేదు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అధికారాన్ని వీడబోతున్నారనే ఊహాగానాలు, అంతర్జాతీయ మీడియా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దశాబ్దానికి పైగా చైనా రాజకీయాలను శాసిస్తున్న జిన్‌పింగ్, తన పాలనా పగ్గాలను నెమ్మదిగా కమ్యూనిస్టు పార్టీలోని కీలక విభాగాలకు బదిలీ చేస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో జిన్‌పింగ్ పలు కీలక అంతర్జాతీయ సమావేశాలకు, దేశీయ అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉండటం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది.

బ్రెజిల్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సుకు ఆయన గైర్హాజరయ్యారు. గత 12 ఏళ్లలో ఆయన బ్రిక్స్ సమావేశానికి హాజరుకాకపోవడం ఇదే మొదటిసారి. చైనాలో జిన్‌పింగ్ తనదైన ముద్ర వేశారు. ఓ నియంతగా పేరు తెచ్చుకున్నారు. అదే సమయంలో చైనాను అగ్రస్థానంలో నిలిపేందుకు అనేక సంస్కరణలు చేపట్టారు. షీ జిన్‌పింగ్ 2012లో చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుండి ఆయన తన అధికారాన్ని పటిష్టం చేసుకోవడానికి వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. తన పాలన ప్రారంభంలోనే అగ్రశ్రేణి నాయకుల నుంచి చిన్న ఉద్యోగుల వరకు అందరినీ లక్ష్యంగా చేసుకున్నారు. భారీ ఎత్తున అవినీతి వ్యతిరేక ప్రచారాన్ని ప్రారంభించారు. ఇది పార్టీలో తన ప్రత్యర్థులను తొలగించి, తన పట్టు నిలుపు కునేందుకు సహాయపడింది. జిన్‌పింగ్ తనకు అనుకూలంగా 2018లో రాజ్యాంగాన్ని సైతం సవరించారు. అధ్యక్ష పదవికి ఉన్న రెండు–పదవీకాలాల పరిమితిని తొలగించారు. ఇది ఆయనకు జీవితకాల అధ్యక్షుడిగా ఉండే అవకాశాన్ని కల్పించింది. ఈ చర్య ద్వారా ఆయన అధికారాన్ని తన గుప్పిట్లో శాశ్వతంగా ఉంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అర్థమైంది. అందుకే ఆయన ఓ నియంతలా పేరు తెచ్చుకున్నారు. చైనా చరిత్రలో మావో జెడాంగ్ తర్వాత అత్యంత శక్తివంతమైన నాయకుడిగా మారారు. శాశ్వత అధ్యక్షుడిగా ఉండేందుకు జిన్‌పింగ్ రాజ్యాంగ నిబంధనలను మార్చుకున్నప్పటికీ, ఇప్పుడు ఆయన అధికారాన్ని వదులుకునేందుకు సిద్ధమయ్యారనే వార్తలు ఆసక్తి రేపుతున్నాయి.

# ఢిల్లీ సహా ఉత్తరాదిలో స్వల్ప భూ ప్రకంపనలు

**హర్యానాలోని జజ్జర్ కేంద్రంగా భూకంపం**

**రిక్టర్ స్కేలుపై తీవ్రత 4.4 గా ఉన్నట్లు గుర్తింపు**



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఉత్తరాదిలో పలు ప్రాంతాల్లో స్వల్ప భూకంపం వచ్చింది. గురువారం ఉదయం 9.04 గంటలకు ఢిల్లీ–ఎన్‌సీఆర్‌తోపాటు దాని సరిహద్దుల్లో ఉన్న రాష్ట్రాల్లో భూమి కంపించింది. దీని తీవ్రత 4.4 గా ఉన్నదని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ వెల్లడించింది. భూకంప కేంద్రం హర్యానాలోని జజ్జర్‌లో ఉన్నదని తెలిపింది. భూమి అంతర్భాగంలో 10 కిలోమీటర్లలోతులో ప్రకంపనలు సంభవించాయని పేర్కొంది. భూకంపంతో భయందోళనలకు గురైన ప్రజలు రోడ్లపైకి పరుగులు తీశారు. ఢిల్లీ రాజధాని పరిధిలోని నోయిడా, గజియాబాద్‌తోపాటు– హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లో కూడా భూమి కంపించిందని అధికారులు వెల్లడించారు. ఇలా ఉత్తర భారత వాసులను భూకంపం వణికించింది. దేశ రాజధాని దిల్లీ, ఎన్‌సీఆర్ సహా పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం భూప్రకంపనలు సంభవించాయి. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. హరియాణాలోని ఝజ్జర్‌కు ఈశాన్యాన 3 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు– జాతీయ భూకంప కేంద్రం వెల్లడించింది. ఈ ప్రాంతం పశ్చిమ దిల్లీకి కేవలం 51 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. దీంతో దేశ రాజధానిలో ప్రకంపనలు భారీగానే చోటుచేసుకున్నాయి. రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లోనూ భూమి కంపించింది. గతంతో పోలిస్తే ఈసారి ప్రకంపనల తీవ్రత కాస్త ఎక్కువగానే ఉన్నట్లు– తెలుస్తోంది. భూమి కంపించడంతో అనేక చోట్ల ప్రజలు, కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. ఇప్పటివరకు ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించ లేదని అధికారులు తెలిపారు. మరోవైపు, దిల్లీలో బుధవారం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు ఇప్పుడు ప్రకంపనలు చోటు చేసుకోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అటు ఎన్డీఆర్ఎఫ్ దీనిపై అడ్వైజరీ జారీ చేసింది. ప్రజలు ఆందోళనకు గురికావొద్దని, ఇలాంటి సమయాల్లో లిఫ్ట్‌కు బదులుగా మెట్లు దిగి కిందకు రావాలని సూచించింది.

# అసెంబ్లీ సమావేశాల్లో మీడియాదే కీలకపాత్ర



హైదరాబాద్: తెలంగాణ ఉభయ సభలు సజావుగా జరగడానికి అందరూ సహకరించాలని, ముఖ్యంగా మీడియా ప్రతినిధులు ఇందులో కీలక పాత్ర పోషించాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ లేజిస్లేటివ్ మీడియా అడ్వైజరీ నూతన కమిటీ– మొదటి సమావేశం గురువారం శాసనసభ భవనంలోని కమిటీ హాల్ లో జరిగింది. ఈ సమావేశంలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, లేజిస్లేటివ్ సెక్రటరీ డా. వి. నరసింహా చార్యులు, కమిటీ చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కో చైర్మన్ పరిపూర్ణాచారి,కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా కమిటీ– చైర్మన్, కో చైర్మన్ కమిటీ సభ్యులకు స్పీకర్, చైర్మన్, మంత్రి, సెక్రటరీలు పుషగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... తెలంగాణ లేజిస్లేటివ్ మీడియా అడ్వైజరీ నూతన కమిటీ– చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస రెడ్డి , కో చైర్మన్ పరిపూర్ణాచారి మరియు సభ్యులందరికీ శు భాకాంక్షలు తెలియజేశారు. ప్రజాస్వామ్యంలో కీలకమైన శాసనసభ, మండలి గౌరవం, ప్రాధాన్యతలను కాపాడుతూ మీడియా సలహా మండలి ద్వారా మీ వంతుగా సేవలను అందించడం మంచి అవకాశం అని చెప్పారు. సీనియర్ జర్నలిస్టులుగా మీరు ఎంతో అనుభవం ఉన్నవారని, ఉభయ సభలు సజావుగా జరగడానికి తమ వంతు సహకారాన్ని ఎల్లప్పుడూ అందించాలని కోరారు. మనందరం కలిసి శాసనసభ, శాసనమండలి సమావేశాలు సజావుగా జరిగి, అర్ధవంతమైన చర్చల జరిగే విదంగా చేయడం ద్వారా రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలని అందరి ఉద్యేశం అని వ్యాఖ్యానించారు. శాసనసభ సమావేశాల సమయంలోనే కాదు, ఇతర సమయాలలో కూడా శాసనసభ కు సంబంధించిన వార్తలకు తగు ప్రాధాన్యత ఇవ్వాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. శాసనసభ ,శాసనమండలి సమావేశాలు సజావుగా నడవాలి అంటే మీడియా పాత్రనే కీలకమని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ– సభను హుందాగా నడవడానికి అన్ని విధాలుగా సహకారం అందించాలని, రానున్న రోజుల్లో శాసన సభ,శాసన మండలి ఒకే భవనంలోకి రాబోతున్నాయి కావున కొన్ని చేంజెస్ కూడా చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మీడియా కమిటీ– సభ్యులకు ఎలాంటి సహాయం కావాలన్న అన్ని వేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ... శాసనసభ, శాసన మండలి వ్యవహారాలలో మీడియాకు బాధ్యతను కల్పించడానికి, మరింత పాత్రను పోషించడానికే మీడియా అడ్వైజరీ కమిటీని నియమించినట్లు తెలిపారు. ఉభయ సభల నిర్వాహణలో అందరి సహకారాన్ని కోరారు. సమావేశాల సందర్భంగా మీడియా ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు, వసతులపై ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా సమావేశాల సందర్భంగా జారీ చేసే పాస్ ల విషయంలో కమిటీ సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని, మంచి వాతావరణంలో సమావేశాలు జరిగే విధంగా అందరం కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. కమిటీ– చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... సమావేశాల సందర్భంగా కవరేజ్ చేసే మీడియా ప్రతినిధులందరికి పాస్ లు అందే విధంగా సూచనలను అందిస్తామని స్పష్టం చేశారు. మీడియా ప్రతినిధులకు అవసరమయ్యే సౌకర్యాలపై అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సూచనలను చేస్తామని తెలిపారు.

# స్కూలు బస్సులో మంటలు

### విద్యార్థులకు తప్పిన ముప్పు

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లాలో కిష్టారెడ్డిపేటలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సులో మంటలు చెలరేగాయి. ఔటర్ రింగ్ రోడ్డు కు సమీపంలో రెడ్లగడ్డలో విద్యార్థులను బస్సులోకి ఎక్కిస్తున్న క్రమంలో మంటలు అంటుకున్నాయి. వెంటనే విద్యార్థులను బస్సు డ్రైవర్, క్లీనర్ కిందకు దించేశారు. చూస్తుండగానే బస్సు మొత్తం మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశాయి. బస్సు పాక్షికంగా కాలిపోయిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ప్రాణాపాయ తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్ తోనే బస్సులో మంటలు అంటుకున్నట్టు– సమాచారం.

## తక్కువ ఖర్చుతో బ్యాటరీ సైకిల్



అమరావతి: అతి తక్కువ ఖర్చుతో, బ్యాటరీతో నడిచే సైకిల్‌ను రూపొందించిన విజయనగరం జిల్లాకు చెందిన ఇంటర్ విద్యార్థి రాజాపు సిద్ధూని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. వినూత్న ఆలోచనతో సరికొత్త ఆవిష్కరణకు రూపం ఇచ్చిన సిద్ధూ గురించి సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న పవన్.. అతణ్ని మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడారు. అతని ఆలోచనలు తెలుసుకుని అబ్బురపడ్డారు. సిద్ధూ రూపొందించిన గ్రాసరీ గురూ వాట్సప్ సర్వీస్ బ్రోచర్ చూసి ప్రత్యేకంగా అభినందించారు. అతని ఆలోచనలకు మరింత పదును పెట్టాలని ఆకాంక్షిస్తూ రూ.లక్ష ప్రోత్సాహకం అందించారు. ఆ సైకిల్‌పై సిద్ధూని కూర్చోబెట్టుకొని నడిపారు. సిద్ధూది విజయనగరం జిల్లాలోని జాడవారి కొత్తవలస గ్రామం. తన ఇంటి నుంచి దూరంగా ఉన్న కాలేజీకి వెళ్లేందుకు ఇబ్బంది పడ్డ సిద్ధూ.. స్వయంగా ఒక బ్యాటరీ సైకిల్‌కు రూపకల్పన చేశాడు. ఈ సైకిల్‌ను మూడు గంటలు పాటు ఛార్జ్ చేస్తే 80 కిలోమీటర్లు ప్రయాణించగలదని సిద్ధూ పేర్కొన్నాడు.

# హెచ్‌సీఏలో రెండేళ్లలో 170 కోట్ల గోల్‌మాల్

**సిఐడి విచారణలో వెలుగుచూసిన అవినీతి**

హైదరాబాద్: హెచ్‌సీఏలో రెండేళ్లలో 170 కోట్ల రూపాయలు గోల్‌మాల్ జరిగినట్లు సీఐడీ గుర్తించింది. ప్లేయర్స్ ఎంపికలో అవినీతి చేసినట్లు సీఐడీ విచారణలో వెల్లడైంది. హెచ్‌సీఏ సభ్యులు ప్లేయర్స్ తల్లిదండ్రులు నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. హెచ్‌సీఏలో చెక్ పవర్‌ను దుర్వినియోగం చేసినట్లు– తేలింది. బీసీసీఐ ద్వారా వచ్చిన నిధుల్లో గోల్‌మాల్ జరిగిందని సీఐడీ పేర్కొంది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావును తెలంగాణ సీఐడీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఐపీఎల్ 2025 సమయంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో టికెట్ల వివాదం నేపథ్యంలో చేపట్టిన దర్యాప్తులో ఆర్థిక అక్రమాలు వెలుగుచూడటంతో.. జగన్‌మోహన్‌ని సీఐడీ అదుపులోకి తీసుకుంది. జగన్‌మోహన్‌తోపాటు– హెచ్‌సీఏ కోశాధికారి శ్రీనివాస్ రావు, సీఈవో సునీల్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ యాదవ్, ఆయన భార్య కవితలను సీఐడీ అరెస్ట్ చేసి విచారించింది. ఈ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఎస్ఆర్‌హెచ్ నుంచి కాంప్లిమెంట్రీ– పాస్‌లను సైతం బ్లాక్‌లో అమ్ముకొని నిందితులు సొమ్ము చేసుకున్నారు. క్రీడాకారుల కోసం ఉపయోగించాల్సిన కాంప్లిమెంటరీ పాస్‌లలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని తేలింది. ఎస్ఆర్‌హెచ్‌పై జగన్మోహన్ రావు వేధింపుల వ్యవహారంలో యాజమాన్యం స్టేట్‌మెంట్‌ను సీఐడీ రికార్డ్ చేసింది. ఐపీఎల్ 2025 టికెట్ల కోసం జగన్‌మోహన్ రావు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్లు– ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఎస్ఆర్‌హెచ్,హెచ్‌సీఏ మధ్య టికెట్ల వివాదం నెలకొనడంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక ఆధారంగా దర్యాప్తు చేయాలని సీఐడీని ప్రభుత్వం ఆదేశించింది. ఎస్ఆర్‌హెచ్, టీ–సీఏ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సీఐడీ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది.

# సికింద్రాబాద్ బోనాల జాతర

### రెండ్రోజుల పాటు వైన్స్ మూసివేత




హైదరాబాద్: సికింద్రాబాద్ ఉజ్జయిని బోనాలను పురస్కరించుకని రెండు రోజుల పాటు– వైన్ షాపులు బంద్ చేస్తున్నట్లు పోలీస్ శాఖ వెల్లడించింది. హైదరాబాద్ మహానగరంలోని సికింద్రాబాద్‌లో బోనాల సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు– వివరించింది. ఈ మేరకు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జులై 13వ తేదీ ఉదయం 6:00 నుండి 15వ తేదీ ఉదయం 6:00 గంటల వరకు సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ హైదరాబాద్ పరిధిలోని వైన్స్ షాపులు, బార్లు బంద్ ఉంటాయని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి జాతర (బోనాలు) సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు– తెలిపారు. సెంట్రల్ జోన్ పరిధిలో గాంధీ నగర్ డివిజన్.. అలాగే ఈస్ట్ జోన్ పరిధిలో చిలకలగూడ డివిజన్‌లోని చిలకలగూడ, లాలాగూడ, వారాసిగూడ.. అదే విధంగా నార్త్ జోన్ పరిధిలో బేగంపేట డివిజన్, గోపాలపురం డివిజన్ పరిధిలో గోపాలపురం,
తుకారాం గేట్, మారేడుపల్లితోపాటు– మహంకాళి డివిజన్ అంటే.. మహంకాళి, రామ్‌గోపాల్‌పేట, మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్యం షాపులన్నీ మూసి ఉంటాయని ఆ ఉత్తర్వుల్లో వివరించారు.
ఆషాఢ మాసం ప్రారంభమైంది. తెలంగాణలో బోనాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. బోనాలు నేపథ్యంలో ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. నగరంలోని ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు భద్రతా ఏర్పాట్లు– చేశారు.

## మానవ అక్రమ రవాణా ముఠా చెరలో కుమారులు

అమరావతి,:ఎవ్వరు ఎలాంటి ఆపదలో ఉన్నా, తమకు సహాయం చేయండి అని అర్థిస్తే చాలు డిప్యూటీ– సీఎం పవన్ కళ్యాణ్ వెంటనే స్పందిస్తున్నారు. ఇటీవల తీవ్ర కష్టాల్లో ఉన్న నటి పాకీజాకు డిప్యూటీ సీఎం 2లక్షల ఆర్థిక సాయం అందించారు. ఇలా ఎంతో మందికి.. అనేక విధాలుగా సహాయం అందించారు. తాజాగా ఓ మహిళ కష్టం చూసి చలించిపోయారు. ఆ మహిళ సమస్య విన్న వెంటనే తక్షణమే స్పందించారు డిప్యూటీ– సీఎం. మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో మగ్గుతున్న తమ కుమారులను రక్షించాలంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఓ మహిళ వినతి చేశారు. దీనిపై వెంటనే స్పందించిన డిప్యూటీ– సీఎం.. ఈ సమస్యను విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకువెళ్లారు. ఉద్యోగాల కోసం ప్రయత్నించి ఏజెంట్ చేతిలో మోసపోయి విదేశాల్లో మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో మగ్గుతున్న తమ కుమారులను రక్షించాలని పవన్‌ను విజయనగరానికి చెందిన గండబోయిన సూర్యకుమారి అనే మహిళ కోరారు.

# శ్రీశైలం జలాశయానికి భారీగా వరద

**మూడు గేట్లు ఎత్తి నీటి విడుదల**



శ్రీశైలం: కృష్ణ బేసిన్‌కు వరద ప్రవాహం యధావిధిగా కొనసాగుతుంది. శ్రీశైలం జలాశయానికి 1,62 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతుండగా శ్రీశైలం ప్రాజెక్టు ఎగువన ఉన్న జూరాల12 సుంకేసుల ప్రాజెక్టు 13 గేట్లను ఎత్తి దిగువ శ్రీశైలంకు నీటిని వదులుతున్నారు. శ్రీశైలం జలాశయంనకు లక్ష అరవై వేల క్యూసెక్కుల ఇన్ ఎ÷–లో కొనసాగుతుండడంతో ప్రాజెక్ట్ మూడు గేట్లను ఎత్తి దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టు వైపుకు 81 వేల క్యూసెక్కులు కుడి ఎడమ గట్టు జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 67 వేల క్యూసెక్కుల నీటిని వదులుతుండడంతో నాగార్జునసాగర్ కు మొత్తం 1లక్ష 48 వేల క్యూసెక్కుల నీటిని వదులు తున్నారు. ఎగువ కర్ణాటక మహారాష్ట్ర ను కురుస్తున్న వర్షాలకు జూరాల ఎగువన ఉన్న అలమట్టి నారాయణపూర్ ప్రాజెక్టులకు ఇన్ ఎ÷–లో సాగుతుంది. నారాయణపురం డ్యాం నుంచి జూరాల ప్రాజెక్టుకు ఒక లక్ష పదివేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నడంతో 12 గేట్ల ఎత్తి శ్రీశైలం వైపుకు వెళుతున్నారు. జూరాలలో ఎగువ దిగువ విద్యుత్ కేంద్రాల ద్వారా ఉత్పత్తి అనంతరం మరో 29వేల కేశకులను వదులుతున్నారు. సుంకేసుల బ్యారేజ్ కి ఎక్కువ తుంగభద్ర నది నుంచి 55 వేల క్యూసెక్కుల ఇన్ ఎ÷–లో వస్తుంది. దీంతో ప్రాజెక్ట్ అధికారులు 13 గేట్లను ఎత్తి దిగువ శ్రీశైలం వైపుకు 52 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుపై ఆధారపడిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 1600 కి శక్తుల నీరు ఎత్తిపోస్తుండగా... రాయలసీమకు పోతిరెడ్డిపాడు ద్వారా 20వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం జలాశయంలో 215 టీఎంసీలకు గాను ప్రస్తుతం 202 టిఎంసిల మేర నీరు నిలువ ఉంది. అడుగులలో 885 అడుగులకు గాను 882.70 అడుగులలో నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులో ఇంతే స్థాయిలో నీటిని నిలువ ఉంచుతూ శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు– ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహానికి అనుగుణంగా గేట్లు– తెరుస్తూ మూస్తూ వస్తున్నారు. గురువారం మూడు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. మరో వారం రోజుల పాటు– ఇదే మోతాదులో కృష్ణా బేసిన్ కు వరద కొనసాగే అవకాశాలు ఉన్నట్లు– అధికారులు అంచనా వేస్తున్నారు.

# రేవంత్‌రెడ్డి విజ్ఞప్తిపై స్పందించిన కేంద్రమంత్రి



తెలంగాణ: యూరియా కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిసి యూరియా సరఫరా చేయాలని కోరగా, ఆయన వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సూచిస్తూ, ప్రత్యామ్నాయ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని రేవంత్ రెడ్డికి నడ్డా సూచించారు. రైతులందరికీ ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

తెలంగాణ రైతాంగానికి సంబంధించిన విషయంలో ముఖ్యమంత్రి రేవంతరెడ్డి విజ్ఞప్తిపై కేంద్రం సానుకూలంగా స్పందించింది. రెండు రోజుల కిందట ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్ర మంత్రి జేపీ నడ్డా ను కలిసి ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత లేకుండా చూడాలని కోరారు. తెలంగాణకు సరిపడా యూరియాను కేంద్ర ప్రభుత్వం సరఫరా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన జేపీ నడ్డా, తెలంగాణ రైతులకు అవసరమైన యూరియాను అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. తెలంగాణలో యూరియా ఎరువులకు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తగినంత యూరియా సరఫరా చేయాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్నామని కేంద్ర మంత్రి జేపీ నడ్డా చెప్పారు. తెలంగాణ రైతుల డిమాండ్‌ను నెరవేర్చేందుకు ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. ఢిల్లీలో మీడియాతో జేపీ నడ్డా మాట్లాడుతూ... రసాయన ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల భూ సారం తగ్గిపోతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీని గురించి తెలంగాణ ముఖ్యమంత్రికి సూచించినట్లు తెలిపారు. 2023-24 రబీ సీజన్‌తో పోలిస్తే 2024-25లో 21 శాతం యూరియా అమ్మకాలు పెరిగాయని ఆయన వెల్లడించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం 12.4 శాతం వినియోగం పెరిగిందని చెప్పారు. యూరియాను వ్యవసాయేతర అవసరాలకు వాడకుండా చూడాలని నడ్డా సూచించారు.

ప్రత్యామ్నాయ ఎరువులు వినియోగం, సేంద్రీయ వ్యవసాయం ద్వారా రసాయన ఎరువుల వాడకం బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి జేపీ నడ్డా తగ్గించవచ్చని అన్నారు. దీనికోసం పథకం గురించి తెలంగాణ అధికారులకు వివరించారు. ఈ విషయాన్ని కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి రంజిత్ కుమార్ మిశ్రా తెలియజేశారు. రాష్ట్రంలోని జిల్లాల మధ్య ఎరువుల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని అధికారులను జేపీ నడ్డా ఆదేశించారు. రైతులందరికీ ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



# డైవర్షన్ పాలిటిక్స్ వద్దంటూ సెటైర్లు!

తెలంగాణ: జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడం కాదు, తామే పోలీస్ కంట్రోల్ సెంటర్‌కు వస్తామని అన్నారు. రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని, మహిళలకు నెలకు రూ. 2,500 ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సింగరేణిని ప్రైవేట్ పరం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రేవంత్ రెడ్డికి అవినీతి చక్రవర్తి, అసమర్థ ముఖ్యమంత్రి అనే బిరుదు ఇచ్చామని కవిత విమర్శించారు.

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను పదే పదే అసెంబ్లీకి రావాలంటూ సీఎం రంకెలు వేస్తున్నారని, ముందు మహిళలకు ఇస్తానన్న హామీల గురించి మాట్లాడాలని ఎద్దేవా చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడం కాదు.. తామే మీ పోలీస్ కంట్రోల్ సెంటర్‌కు వస్తామంటూ సెటైరికల్‌గా మాట్లాడారు. డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడటం మానుకొని మహిళలకు ఎందుకు తులం బంగారం ఇస్తలేరో చెప్పాలంటూ ప్రశ్నించారు.

తెలంగాణ జాగృతిలో కొత్తగూడెం సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీరన్న చేరిక సందర్భంగా కవిత మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని మహిళలకు ఇస్తానన్న నెలకు రూ. 2,500ను ఎందుకు ఇవ్వడం లేదో చర్చ చేద్దామన్నారు. తులం బంగారం ఎందుకు ఇస్తలేరో.. పింఛన్లు ఎందుకు పెంచడం లేదో చర్చిద్దామన్నారు. మీ మోసాలను ప్రజలు గమనిస్తూనే ఉంటారని గుర్తుంచుకోవాలని ఆమె చెప్పారు.

తెలంగాణ జాగృతిని రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతపరుస్తామని, సీఐటీయూ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వీరన్న, ఆయన అనుచరుల చేరికపై కవిత హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనీసం జై తెలంగాణ అనడం లేదని, రాష్ట్రంలో పరిపాలన ఎలా ఉందో అందరం చూస్తున్నామన్నారు. రాష్ట్రంలో సంపూర్ణ రైతు రుణమాఫీ కాలేదని.. చర్చకు రమ్మంటే సీఎం పారిపోయాడంటూ ఎద్దేవా చేశారు.

సింగరేణిని రేవంత్ రెడ్డి అస్సలు పట్టించుకోవడం లేదని, కనీసం ఉద్యోగాలు కూడా రావడం లేదంటూ కవిత విమర్శించారు. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ పరం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. రేవంత్ రెడ్డికి అవినీతి చక్రవర్తి, అసమర్థ ముఖ్యమంత్రి అనే బిరుదు ఇచ్చామన్నారు. కొత్తగూడెం అంటేనే పరిశ్రమల జిల్లా అని.. స్పాంజ్ ఐరన్ కర్మాగారాన్ని పునరుద్ధరణ చేయాలని ఆమె కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ.. భద్రాచలం చుట్టుపక్కలున్న ఐదు గ్రామ పంచాయతీలు ఆందోళనలో ఉన్నాయన్నారు. భద్రాచలం రాముడి భూములు పురుషోత్తపట్నంలో ఉన్నాయని, ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలిపేందుకు తుమ్మల చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


# మల్నాడు కిచెన్ డ్రగ్స్ కేసు..

హైదరాబాద్: మల్నాడు కిచెన్ డ్రగ్స్ కేసు ప్రకంపనలు రేపుతోంది. ఈగల్ టీమ్ దర్యాప్తులో సూర్య అనే వ్యక్తి గోవా నుండి డ్రగ్స్ తెప్పించి, కొరియర్ ద్వారా పబ్‌లు, డాక్టర్లకు సరఫరా చేస్తున్నాడని తేలింది. ఆడవాళ్ల చెప్పుల్లో డ్రగ్స్ దాచి రవాణా చేసేవాడని తెలిసింది. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరు ఉన్నారో తెలుసుకోవడానికి ఈగల్ టీమ్ లోతుగా దర్యాప్తు చేస్తోంది. త్వరలోనే మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

హైదరాబాద్‌లో సంచలనంగా మారిన మల్నాడు కిచెన్ డ్రగ్స్ కేసులో ఈగల్ టీమ్ దర్యాప్తు ముమ్మరం చేసింది. అసలు ఈ మల్నాడు కిచెన్‌కు డ్రగ్స్ ఎలా చేరాయి? అక్కడ నుంచి ఎక్కడెక్కడికి డెలివరీ అయ్యాయి? ఇందులో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయి అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. పలువురి డాక్టర్లకు కూడా మల్నాడు కిచెన్ నుంచి డ్రగ్స్ వెళ్లినట్లు ఈగల్ బృందం గుర్తించింది.

గోవాలో నైజీరియా దేశస్థుడు నిక్ నుంచి కొకైన్, ఎండీఎంఏను మల్నాడు కిచెన్ యజమాని సూర్య డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు ఈగల్ టీమ్ విచరణలో బయటపడింది. గోవా నుంచి కొరియర్ల ద్వారా డ్రగ్స్ మల్నాడు కిచెన్‌ను వచ్చేవని.. అక్కడ నుంచి పబ్‌లు, ప్రముఖులకు అవి సప్లయ్ అయినట్లు ప్రత్యేక బృందం గుర్తించింది. మల్నాడు కిచెన్ యజమాని సూర్య అంతర్జాతీయ డ్రగ్స్ రాకెట్ నడుపుతున్నట్లు ఈ విచారణలో వెల్లడయింది. మల్నాడు కిచెన్ నుంచి ఆర్డర్ల వారీగా డ్రగ్స్‌ను సప్లయ్ చేసినట్లు ఈగల్ టీమ్ ఆధారాలు కూడా సేకరించింది. రెస్టారెంట్లతో పాటు హైదరాబాద్‌లో ఉన్న 20 పబ్బులకు ఇప్పటి వరకు డ్రగ్స్ సప్లయ్ అయ్యాయాని, అలాగే పలువురు ప్రముఖులకు డోర్ డెలివరీ చేసినట్లుగా కూడా గుర్తించారు. ఈ ప్రముఖుల్లో హైదరాబాద్‌లోని కొందరు డాక్టర్లు కూడా ఉన్నట్లు ఈగల్ గుర్తించింది.

డ్రగ్స్ కోసం హాస్పిటల్ ట్రీట్మెంట్ పేరుతో రూ. 1.8 లక్షల నగదు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ఈగల్ టీమ్ గుర్తించింది. శ్రీ మారుతి కొరియర్ పేరుతో డ్రగ్స్ ప్యాకెట్లు సరఫరా అయ్యయాని.. ఆడవాళ్ల చెప్పుల హీల్స్ నుంచి కొకైన్, ఎక్స్‌టసీ పిల్స్, ఓజీ కుష్ ఆయిల్‌ను ఈగల్ టీమ్ స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్‌లోని 15 మంది డాక్టర్లకూ కొరియర్ల ద్వారా సూర్య ఈ డ్రగ్స్ అందజేశాడు. మూడు పబ్‌ల యజమానులతో కలిసి అప్పుడప్పుడు డ్రగ్ పార్టీలు కూడా నిర్వహించినట్లు విచారణలో తేలింది. వచ్చే వారం ముగ్గురు పబ్ యజమానులు తమ ఎదుట హాజరుకావాలంటూ నోటీసులు అందించాలనే ఆలోచనలో ఈగల్ టీమ్ ఉంది.



# ఇన్వెస్టిగేషన్ చేయాలి..

తెలంగాణ: బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ వ్యవహారం టాలీవుడ్ లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ వ్యవహారంలో 29 మంది సినీ సెలబ్రిటీలకు ఈడీ నోటీసులు జారీ చేసింది. అయితే ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ బీజేపీ తీరును తప్పుబడుతూ బాలకృష్ణ, పవన్ కళ్యాణ్ లను కూడా విచారించాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్, ఆయన సోదరులు ఎప్పుడూ బెట్టింగ్ యాప్‌లు ప్రమోషన్ చేయలేదా? అంటూ కేఏ పాల్ ఈడీని ప్రశ్నించారు.

టాలీవుడ్‌ని బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ ఇప్పుడు కుదిపేస్తోంది. బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్స్ చేశారంటూ 29 మంది సినీ సెలబ్రిటీలపై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులు నమోదు చేసింది. సైబరాబాద్ పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా విచారణ చేపట్టిన ఈడీ సినీ సెలబ్రిటీలు, యూట్యూబర్స్, ఇన్‌ఫ్లూయెన్సర్లను విచారించేందుకు సిద్ధమైంది. అయితే, బీజేపీ తీరును తప్పుబట్టిన ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ బాలకృష్ణ , పవన్ కళ్యాణ్‌ను కూడా విచారించాలంటూ డిమాండ్ చేశారు.

బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ కేసులో బీజేపీతో సంబంధాలు ఉన్నవారిని విడిచిపెడుతున్నారని కేఏ పాల్ ఆరోపించారు. టీడీపీ, జనసేన నాయకులు బీజేపీ నాయకులు కలిస్తే వారిని వదిలేస్తారా? అంటూ ప్రశ్నించారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, ఏపీ ఉప ముఖ్యమంత్రి కానీ ఆయన సోదరులు కానీ బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోట్ చేయలేదా? అంటూ ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కేఏ పాల్ డిమాండ్ చేశారు. "బాలకృష్ణ అనే ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ, పవన్ కళ్యాణ్ అనే ఉప ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌లో వాళ్ల బ్రదర్స్ ఎప్పుడూ బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోట్ చేయలేదా? ఇన్వెస్టిగేషన్ చేయండీ! ఎవరైనా బీజేపీతో ఉంటే సెలెక్టివ్‌గా వారిని వదిలేస్తారా? బీజేపీతో కలిస్తే ఈడీ రైడ్లు ఉండవు, సీబీఐ రైడ్లు ఉండవు. మీకు పద్మభూషణ్‌లు ఇస్తారు, భారతరత్నలు ఇస్తారు. మిమ్మల్ని చాలా క్లీన్‌గా కాపాడుతారు" అని కేఏ పాల్ అన్నారు.

నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కేసులో నటులు రానా దగ్గుబాటి, ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్, అనన్య నాగళ్ల ఉన్నారు. వారితో పాటు బుల్లితెర నటులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు శ్రీముఖి, నయని పావని, వర్షిణి సౌందరరాజన్, సిరి హన్మంత్, వసంతి కృష్ణన్, శ్యామల, శోభా శెట్టి, అమృతా చౌదరి, నేహా పఠాని, పండు, పద్మావతి, ఇమ్రాన్ ఖాన్, విష్ణు ప్రియా, హర్షసాయి, భయ్యా సన్నీయాదవ్, టేస్టీ తేజ, రీతూ చౌదరి, బండారు సుప్రీత పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు.

హైదరాబాద్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈ కేసులో ఈడీ దర్యాప్తు చేస్తోంది. యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ వీళ్లందరూ ప్రమోషన్స్ చేశారని.. అందుకోసం భారీగా కమీషన్స్ తీసుకున్నారంటూ కొందరు ఫిర్యాదు చేశారు.

# మందుబాబులకు బ్యాడ్ న్యూస్..

తెలంగాణ: బోనాల సందడి మొదలైన వేళ మందుబాబులకు షాక్ తగిలింది. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా హైదరాబాద్ నగరంలో రెండు రోజుల పాటు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. జూలై 13 ఉదయం 6 గంటల నుంచి 15 ఉదయం 6 గంటల వరకు మద్యం అమ్మకాలు నిలిపివేయాలని సీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. భక్తుల భవిష్యవాణి, లక్షలాదిగా తరలివచ్చే ప్రజల దృష్ట్యా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. తెలంగాణలో ఒకపక్క బోనాల సందడి మొదలవ్వగా. . మరోవైపు మందుబాబులకు బిగ్ షాక్ తగిలింది. రాష్ట్రవ్యాప్తంగా బోనాల పండగను అట్టహాసంగా చేసుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. రాజధాని హైదరాబాద్‌లో బోనాల మోత మోగిపోవాల్సిందే. ఇంతటి వేడుకల్లో పాపం మందుబాబులకు చుక్క లేని పరిస్థితి వచ్చింది. రెండు రోజుల పాటు హైదరాబాద్ నగరంలో మద్యం షాపులు బంద్ చేస్తూ పోలీస్ శాఖ నిర్ణయం తీసుకుంది.

సికింద్రబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల పండగ సందర్భంగా రెండ్రోజుల పాటు మద్యం షాపులు మూసేయ్యాలంటూ హైదరాబాద్ సీపీ ఆదేశాలు జారీ చేశారు. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 13వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి 15వ తేదీ ఉదయం 6 గంటల వరకు మద్యం షాపులు మూసేయ్యాలని సీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ సెంట్రల్, ఈస్ట్, నార్త్ జోన్ల పరిధిలోని గాంధీనగర్, చిలకలగూడ, లాలాగూడ, వారాసిగూడ, బేగంపేట, గోపాలపురం, తుకారంగేట్, మారేడ్ పల్లి, మహంకాళి, రామ్‌గోపాల్ పేట, మార్కెట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న అన్ని మద్యం షాపులు రెండు రోజుల పాటు మూతపడనున్నాయి.

బోనాల సందర్భంగా ఈ ఆదివారం రోజున సికింద్రాబాద్‌లో పోలీసులు పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు రోజుల ముందు నుంచే గస్తీ పెంచిన పోలీసులు.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పహారా కాస్తున్నారు. ఉజ్జయిన మహంకాళి బోనాల్లో కీలక ఘట్టం అయిన భవిష్య వాణి రోజు మాతంగి స్వర్ణలత పచ్చికుండపై నిల్చొని చెప్పే భవిష్య వాణి నిజమవుతుందని భక్తుల నమ్మకం. ఈ బోనాల వేడుక చూసేందుకు లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హైదరాబాద్‌లో బోనాల పండగను తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా చేసుకుంటారు. హైదరాబాద్ నగరంలో నెల రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. గోల్కొండ, లాల్ దర్వాజ, ఉజ్జయిని అమ్మవారి బోనాలు చాలా ప్రత్యేకం. అందుకోసమే ఈ రెండు రోజులు బోనాలు జరిగే సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు పోలీసులు ముందస్తుగా జూలై 13 నుంచి 15 వరకు మద్యం షాపులను బంద్ చేశారు.

# కల్తీ కల్లు మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలివ్వాలి..



హైదరాబాద్: కల్తీ కల్లు తాగి ఆరుగురు మృతి చెందడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ ఘటనపై బీజేపీ కూడా స్పందించి, మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది. ఎక్సైజ్ అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు, ఇప్పటికే ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు.

హైదరాబాద్‌లో కల్తీ కల్లు బారిన పడి ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను వెంటనే ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు. మృతిచెందిన ఒక్కొక్క కుటుంబానికి రూ. 20 లక్షల నష్ట పరిహారం అందించాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండి మెరుగైన చికిత్స అందాలని కోరారు.

కల్తీ కల్లు తాగి ఇంత మంది చనిపోతే ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణం అంటూ కేటీఆర్ మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో ప్రజలకు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. కాయకష్టం చేసే కష్ట జీవులు కల్తీ కల్లు బారిన పడకుండా జాగ్రత్త పడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు.

మరోవైపు కూకట్‌పల్లి కల్తీ కల్లు కేసులో ఎక్సైజ్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పలు కల్లు దుకాణాల నుంచి శాంపిల్స్ సేకరించిన అధికారులు వాటిని ల్యాబ్‌కి పంపారు. ల్యాబ్‌లో పరీక్షించగా.. కాంపౌండ్‌లో సేకరించిన కల్లులో కెమికల్స్ ఉన్నట్లు గుర్తించారు. కెమికల్స్ కలిపిన కల్లు వల్లే బాధితులు అస్వస్థతకు గురయ్యారని ఎక్సైజ్ అధికారులు ధృవీకరించారు. ఇప్పటికే ఈ కేసులో ఏడుగురిని ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ ఘటనపై స్పందించారు. కల్తీ కల్లు ఘటనలో నిమ్స్‌లో 31 మంది, గాంధీ ఆస్పత్రిలో ఆరుగురు చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఏడుగురు మొత్తం 44 మందికి మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ ఘటనలో ఆరుగురు చనిపోయారని ప్రతిపక్షాలు చెబుతుంటే.. ప్రభుత్వం మాత్రం నలుగురే ప్రాణాలు కోల్పోయినట్లు చెబుతోంది. కల్తీ కల్లు ఘటనపై బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ కూడా స్పందించింది. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షలు, బాధితులకు రూ. లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్తీ కల్లులో సైకో ట్రాఫిక్ సబ్ స్టన్స్ కలిపినట్లు స్పష్టంగా తెలుస్తోందని, ఎక్సైజ్ శాఖ కల్లు కాంపౌండ్ వారితో కుమ్మక్కైందంటూ ఆయన ఆరోపించారు.

# ఏ క్షణమైనా గేట్లు ఎత్తేయొచ్చు!

తెలంగాణ: భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారాయి. కడెం ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టుకు దిగువన ఉన్న గ్రామాల ప్రజలను అధికారులు అలర్ట్ చేశారు. జూరాల నుంచి శ్రీశైలానికి, నాగార్జున సాగర్ నుంచి కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతుండ టంతో స్నాన ఘట్టాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కాళేశ్వరం మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం పెరిగింది.



తెలంగాణతో పాటు ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకున్నాయి. నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దాంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల ప్రజలను అలర్ట్ చేశారు. గంట గంటలకు వరద ఉధృతి పెరుగుతుండటంతో ఏ క్షణమైనా గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మందపల్లి వద్ద ఉన్న పలికేరు వాగు, కడెం నది తాటిగూడ వద్ద, చిక్ మాన్ వాగు, కుప్టి వాగు వద్ద రెయిన్ ఫాల్ గేజింగ్ స్టేషన్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నాలుగు స్టేషన్ల వద్ద వరద ఉధృతిని అంచనా వేసి దానికి అనుగుణ ంగా నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. గేజింగ్ స్టేషన్లకు సెన్సార్లను అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు వరద ఉధృతి అంచనా వేస్తారు. గతంలో కడెం ప్రాజెక్టుకు సంబంధించిన గేట్లు మరమ్మతులు కాగా.. ప్రస్తుతం అన్ని పనులు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కడెం ప్రాజెక్టుతో పాటు మిగతా జలాశయాలన్నీ నిండు కుండలా మారాయి. ప్రియదర్శిని జూరాల జలాశయానికి లక్షా 25 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, 14 గేట్లు ఎత్తి దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల సహా సుంకేసుల నుంచి కూడా శ్రీశైలానికి రెండు లక్షల 13 వేల 824 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. అదేవిధంగా నల్గొండ జిల్లాలోని నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు కూడా అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ జలాశయం నీటి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 200 టీఎంసీల నీరు ఉంది. పై నుంచి ఎక్కువగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో 590 అడుగులకు గాను 535.7 అడుగులకు ప్రస్తుతం నీళ్లు ఉన్నాయి. భారీగా నీటి ప్రవాహం ఉండటంతో నాగార్జున సాగర్ నుంచి కాల్వలకు నీటిని వదులుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం కూడా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యా రు. గోదావరి స్నాన ఘట్టాల వద్దకు వెళ్లే భక్తులు ఒడ్డున మాత్రమే స్నానాలు చేయాలని అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద కూడా జలకళ సంతరించుకుంది. మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం పెరగడంతో వచ్చిన నీరు వచ్చినట్లు కిందకు విడుదల చేస్తున్నారు.

# నా కోడి కాళ్లు విరగ్గొట్టారు సార్..

నల్లగొండ: జిల్లాలో గంగమ్మ అనే వృద్ధురాలు తన కోడిని రాకేష్ అనే వ్యక్తి కొట్టాడని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కోడి కాలు విరగడంతో ఆమె ఆగ్రహంతో ఊగిపోయింది. డబ్బులు వద్దని, రాకేష్‌కు శిక్ష పడాలని పట్టుబట్టింది. పోలీసులు పంచాయితీ పెట్టి సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించినా, ఇది వారికి పెద్ద తలనొప్పిగా మారింది. ఈ కోడి పంచాయితీ ఊరిలో హాట్ టాపిక్ అయింది.

మనుషుల కన్నా ఎక్కువగా మూగ జీవుల మీద అభిమానం పెంచుకునే వారు మన సమాజంలో చాలా మంది ఉన్నారు. తమ పెంపుడు జంతువులకు చిన్న సమస్య వచ్చినా దాని యజమాని బాధతో విలవిల్లాడతారు. ఇంకాస్త అపురూపంగా పెంచుకునే జంతువుని ఎవరైనా బాధ పెడితే అస్సలు ఊరుకోరు. తమ పెట్స్‌ని బాధపెట్టేవారికి కొందరు మాటలతో సమాధానం చెబితే కొందరు చేతలతో బదులిస్తారు. ఇప్పుడీ ముచ్చట ఎందుకు చెప్పుకుంటున్నామంటే.. తన కోడిని గాయపరిచా డని ఆరోపిస్తూ ఒక వృద్ధురాలు ఒక వ్యక్తి మీద పోలీసు కేసు నమోదు చేసింది.

నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం పోలీస్ స్టేషన్‌లో కోడి పంచాయతీ వెలుగు చూసింది. నకిరేకల్ మండలం గొల్లగూడెంలో ఈ వింత సంఘటన జరిగింది. గంగమ్మ అనే వృద్ధురాలు పెంచుకున్న కోడి విషయంలో గొడవ జరిగింది. అది కాస్త చివరకు పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. రాకేష్ అనే వ్యక్తి కోడిని కర్రతో కొట్టడంతో దాని కాలు విరిగింది. దీంతో గంగమ్మ నకిరేకల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. తన కోడిన గాయపరిచిన రాకేష్ మీద ఫిర్యాదు చేసింది.

గంగమ్మ తన కోడిని ఎంతో ప్రేమగా చూసుకునేది. ఆ కోడి రోజూ ఊరిలో తిరుగుతూ సాయంత్రానికి ఇంటికి వచ్చేది. అయితే రాకేష్ ఇంటి దగ్గర గడ్డివాములో గింజలు తింటున్నం దుకు అతడు కోడిని కొట్టాడు. కోడి కాలు విరగడంతో గంగమ్మ బాధతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. రాకేష్ మీద కేసు పెట్టమని ఆమె పోలీసులను కోరింది. నా కోడిని నా కళ్లముందే కొట్టాడు. నాకు డబ్బులు వద్దు... రాకేష్‌కు శిక్ష పడాలి అని గంగమ్మ డిమాండ్ చేసింది. ఆమె మాటలు విని పోలీసులు ఆశ్చర్య పోయారు. గంగమ్మను బుజ్జగించడానికి ప్రయత్నించారు. కానీ ఆమె వినలేదు. చివరికి పోలీసులు గ్రామానికి వచ్చి పంచాయతీ పెట్టి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కోడికి ట్రీట్‌మెంట్ చేయించాలని సూచించి ఆమెను ఇంటికి పంపించారు. ఇది కేవలం కోడి గొడవ కదే అని అనుకున్నారు. కానీ ఇదే వారికి పెద్ద తలనొప్పి తెచ్చిపెట్టింది. దీని గురించి తెలిసి మరికొంత మంది ఇలాంటి కేసులే తీసుకొస్తారు.. అప్పుడేంటి పరిస్థితి అని పోలీసులు తలలు పట్టుకుంటు న్నారు. ప్రస్తుతం ఈ సంఘటన ఆ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. కోడిని కొట్టినందకు ఏకంగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లిందంటే ఆమెకు ఆ కోటి అంటే ఎంత అభిమానమో అర్థం అవుతుంది అంటున్నారు ఈ విషయం తెలిసిన వాళ్లు.

వేగుచుక్క

# గట్టిగానే ప్లాన్ చేస్తున్నాడే!



నేచురల్ స్టార్ నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న ‘ది పారడైజ్’ చిత్రం గ్లోబల్ స్థాయిలో విడుదల కానుంది. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయల్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. రాఘవ్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ, సినిమాలో ఆయన పాత్ర ప్రత్యేకంగా ఉంటుందని పేర్కొన్నారు. ‘కిల్’ సినిమాలో విలన్‌గా మెప్పించిన రాఘవ్, ఈ చిత్రంలోనూ విభిన్నమైన పాత్రలో కనిపించనున్నాడని సమాచారం.

నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ‘ది పారడైజ్’. ‘దసరా’ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తోన్న సినిమా ఇది. భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఈసారి పాన్ ఇండియా కాదు, గ్లోబల్ వైడ్ గా రిలీజ్ చేయాలని ప్లాన్ చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా స్టార్ క్యాస్టింగ్, టాప్ నాచ్ టెక్నిషియన్స్ ను ఈ ప్రాజెక్ట్ లోకి తీసుకుంటున్నారు. తాజాగా మేకర్స్ సినిమాకి సంబంధించిన ఓ క్రేజీ అప్డేట్ అందించారు.



‘ది పారడైజ్’ సినిమాలో నటించే ప్రధాన నటీనటుల గురించి ఇప్పటికే సోషల్ మీడియాలో వార్తలు ప్రచారంలో ఉన్నాయి. హీరోయిన్ గా ఫలానా బాలీవుడ్ బ్యూటీని తీసుకుంటున్నారని, విలన్ గా ఓ పాపులర్ స్టార్ నటించనున్నారని చెప్పుకుంటున్నారు. కానీ ఏదీ అఫీషియల్ గా అనౌన్స్ చేయలేదు. టైటిల్ గ్లింప్స్ ద్వారా మరాఠీ నటి సోనాలి కులకర్ణి కీలక పాత్రలో కనిపించనున్నారనే విషయం స్పష్టమైంది. అయితే ఈ సినిమాలో బాలీవుడ్ యాక్టర్ రాఘవ్ జుయల్ కూడా భాగమయ్యారని చిత్ర బృదం అధికారికంగా ప్రకటించింది. (బాహుబలి వస్తున్నాడు.. భారతీయ సినిమా చరిత్రను తిరగరాసిన వెండితెర అద్భుతానికి 10 ఏళ్లు!) రాఘవ్ జుయల్ పుట్టినరోజు సందర్భంగా ‘ది పారడైజ్’ టీమ్ సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేసింది. ఆయన ఈ సినిమాలో ఓ యునిక్ రోల్ లో కనిపించనున్నారని, అది కచ్చితంగా అందర్నీ సర్ప్రైజ్ చేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాఘవ్ కు డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల తన క్యారక్టర్ గురించి వివరిస్తున్న ఓ వీడియోని షేర్ చేసారు. లూజ్ హాఫ్ హ్యాండ్స్ షర్ట్ ధరించి, క్లీన్ షేవ్, మీసాలతో కంప్లీట్ డిఫరెంట్ గా కనిపిస్తావని శ్రీకాంత్ చెబుతుండగా.. అద్భుతంగా ఉందని జుయల్ చెప్పడాన్ని ఈ వీడియోలో చూడొచ్చు. సెట్లో గన్నులు, గొడ్డళ్లు, రకరకాల ఆభరణాలు, పక్కనే దున్నపోతు వంటి సెటప్ చూస్తుంటే.. ఇందులో రాఘవ్ జుయల్ పాత్ర చాలా వైవిధ్యంగా ఉండబోతోందని తెలుస్తోంది. అది పక్కా విలన్ పాత్ర అనే సందేహాలు కలుగుతున్నాయి.

# రాజాసాబ్ సినిమాతో క్లాష్..



ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో వస్తున్న ‘ది రాజాసాబ్’ మూవీ డిసెంబర్ లో విడుదల కానుంది. ఇది ప్రభాస్ కెరీర్ లోనే మొదటి హారర్ కామెడీ చిత్రం. అయితే అదే రోజున సంజయ్ దత్ నటించిన మరో హిందీ సినిమా ‘ధురంధర్’ కూడా విడుదల కానుంది. రెండు సినిమాల్లోనూ సంజయ్ దత్ ఉండటంతో, ఈ క్లాష్ పై ఆయన స్పందించారు. రెండు చిత్రాలూ తనకు ముఖ్యమేనని, బాక్సాఫీస్ క్లాష్ ఉండకూడదని ఆయన కోరుకుంటున్నారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ ‘ది రాజాసాబ్’. ఇదొక రొమాంటిక్ హారర్ కామెడీ. ప్రభాస్ కెరీర్‌లోనే ఇది మొదటి హారర్ కామెడీ కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో నిధి అగర్వాల్, మాళవిక మోహన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ పాన్ ఇండియా మూవీని డిసెంబర్ మొదటి వారంలో విడుదల చేయనున్నారు. అయితే దీనికి సోలో రిలీజ్ దొరకడం లేదు. పోటీగా మరో రెండు హిందీ సినిమాలను బరిలో దింపుతున్నారు. దీనిపై బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ స్పందించారు.‘ది రాజాసాబ్’ సినిమాని డిసెంబర్ 5వ తేదీన థియేటర్లలోకి తీసుకొస్తామని మేకర్స్ ఇటీవలే అధికారికంగా ప్రకటించారు. రణవీర్ సింగ్ నటిస్తున్న ‘ధురంధర్’ అనే హిందీ మూవీని అదే రోజున రిలీజ్ చేయనున్నట్లు అనౌన్స్ చేసారు. అయితే ఈ రెండు సినిమాల్లోనూ సంజయ్ దత్ కీలక పాత్రలు పోషించారు. వేటికవే ప్రత్యేకమైన క్యారెక్టర్స్ లో కనిపించబోతున్నారు. ఈ సినిమాలు ఒకే రోజున షెడ్యూల్ చేయడంపై సంజూ భాయ్ మాట్లాడారు. టీజర్ లాంచ్ ఈవెంట్ లో మీడియా మిత్రులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ.. రెండు చిత్రాల మధ్య క్లాష్ ఉండకూడదని కోరుకుంటున్నానని అన్నారు. రాజాసాబ్, ధురంధర్ సినిమాలలో రెండు డిఫరెంట్ క్యారెక్టర్స్ లో నటిస్తున్నాను. రెండు చిత్రాల మధ్య క్లాష్ ఏర్పడకూడదని నేను కోరుకుంటున్నాను. మేకర్స్ అలా చేయరని నేను ఆశిస్తున్నాను. ప్రతి సినిమా నాకు ముఖ్యమైనదే. ఎన్నో విభిన్నమైన పాత్రలు చేయడానికి నాకు అవకాశం లభించినందుకు అదృష్టంగా భావిస్తున్నా” అని సంజయ్ దత్ అన్నారు. మరి రాజాసాబ్, ధురంధర్ సినిమాల దర్శక నిర్మాతలు కూడా సంజయ్ మాదిరిగా ఆలోచించి, ఎవరైనా వెనక్కి తగ్గుతారేమో చూడాలి. 1998లో అక్కినేని నాగార్జున హీరోగా రూపొందిన ‘చంద్రలేఖ’ సినిమాలో సంజయ్ దత్ గెస్ట్ రోల్ లో కనిపించారు. ఆ తర్వాత రామ్ చరణ్ కథానాయకుడిగా తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కిన ‘తుఫాన్’ మూవీలో నటించారు. పూరీ జగన్నాథ్ డైరెక్ట్ చేసిన ‘డబుల్ ఇస్మార్ట్’ సినిమాలో విలన్ క్యారక్టర్ ప్లే చేసారు. ఇప్పుడు ‘ది రాజాసాబ్’ మూవీలో ప్రభాస్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. ‘అఖండ 2’లోనూ సంజయ్ నటిస్తున్నారనే టాక్ ఉంది. ‘కేడీ’తో పాటుగా ‘షెరాన్ డి కౌమ్ పంజాబీ’, ‘బాప్’ సినిమాలు కూడా సీనియర్ యాక్టర్ లైనప్ లో ఉన్నాయి.

# ‘జెట్టి’ హీరో.. రూ.2లక్షల సాయం




నటుడు ఫిష్ వెంకట్ చికిత్స కోసం అండగా నిలిచాడు హీరో మానినేని కృష్ణ. ‘జెట్టి’ చిత్రంతో హీరోగా పరిచయమైన ఆయన 100 %ణతీముఎం ఖీశీబఅస్త్రఅశీఅ% ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నాడు. తాజాగా ఫిష్ వెంకట్‌ను ఆస్పత్రిలో పరామర్శించి, వైద్య ఖర్చుల నిమిత్తం ఆయన కూతురు స్రవంతికి రూ.2 లక్షల చెక్ అందజేశాడు. ఈ సందర్భంగా మాట్లాడిన మానినేని... ‘పునరపి’ అనే అవయవ దాన అవగాహన కార్యక్రమం ద్వారా జీవితం కాపాడే సంకల్పాన్ని పంచుకున్నాడు. సమాజంలో ప్రతి ఒక్కరూ అవయవ దానం గురించి తెలుసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎన్నో సినిమాల్లో కమెడియన్‌గా ప్రేక్షకుల్ని అలరించిన ఫిష్ వెంకట్ ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో ఉన్న సంగతి తెలిసిందే. కొంతకాలం క్రితమే తీవ్ర అనారోగ్యానికి తోడు కాలికి సర్జరీ కావడంతో ఇంటికే పరిమితమైన ఆయన ఇటీవల మళ్లీ ఆస్పత్రి పాలయ్యారు. ఫిష్ వెంకట్‌కి రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని, వెంటనే కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయకపోతే ప్రాణాపాయమని డాక్టర్లు అంటున్నారని ఆయన కూతురు చెబుతున్నారు. ఆపరేషన్‌కి కనీసం రూ.50లక్షల వరకు అవుతుందని.. దాతలు ఎవరైనా సాయం చేయాలని ఆమె వేడుకుంటున్నారు.

తాజాగా ఫిష్ వెంకట్‌కి సాయం చేసేందుకు ఓ హీరో ముందుకు వచ్చారు. ‘ జెట్టి ’ అనే సినిమా ద్వారా హీరోగా టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన మానినేని కృష్ణ 100 అనే స్వచ్ఛంద సంస్థని స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాజాగా ఫిష్ వెంకట్ పరిస్థితి తెలుసుకున్న ఆయన ఆస్పత్రికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. అంతేకాకుండా వైద్య ఖర్చుల నిమిత్తం 2లక్షల రూపాయలను ఫిష్ వెంకట్ కూతురు స్రవంతికి అందజేశారు. ఈ సందర్భంగా మానినేని కృష్ణ మాట్లాడుతూ... తమ సంస్థ చేపడుతున్న కార్యక్రమాల్లో ఒకటైన ‘పునరపి’ (అవయవ దాన అవగాహన) తమ ఆశయం కాదని.. అవసరంలో ఉన్నవారికి జీవితం ఇవ్వాలన్న సంకల్పమని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ అవయవ దానం గురించి తెలుసుకోవాలని సూచించారు. మనం తీసుకునే ఒక నిర్ణయం మరో జీవితాన్ని కాపాడుతుందన్నారు.

# ట్రోలింగ్



‘కన్నప్ప’ సినిమాలో శివుడి పాత్రలో నటించిన అక్షయ్ కుమార్ డైలాగులు చెప్పేటప్పుడు టెలీ ప్రాంప్టర్ వాడినట్లు వీడియోలు వెలుగులోకి వచ్చాయి. నేరుగా కెమెరా చూసే బదులు కళ్లు పక్కకు తిప్పుతూ మాట్లాడడం నెటిజన్లకు అనుమానం కలిగించింది. దీన్ని ఆధారంగా చేసుకుని “పవిత్రమైన శివుడి పాత్రలో నటిస్తూ డైలాగులు కూడా నేర్చుకోలేదా?” అంటూ ట్రోల్స్ వెల్లువెత్తుతున్నాయి. అక్షయ్ మొదట ఈ పాత్రకు ఒప్పుకోకపోయినా, మంచు విష్ణు కోరగా అంగీకరించారని గతంలో చెప్పారు.

మంచు విష్ణు స్వీయ నిర్మాణంలో ముఖేష్ కుమార్ సింగ్ డైరెక్షన్లో తెరకెక్కిన ‘ కన్నప్ప ’ చిత్రం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా మారిన సంగతి తెలిసిందే. తొలిరోజు మంచి టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం మూడు రోజులకే చేతులెత్తేసి ఢీలా పడిపోయింది. ప్రభాస్, అక్షయ్ కుమార్ , మోహన్‌లాల్, శరత్‌కుమార్, కాజల్ అగర్వాల్, మధుబాల వంటి స్టార్లు నటించినా ‘కన్నప్ప’ని కాపాడలేకపోయారు. వచ్చిన ఆ కలెక్షన్లు అయినా ప్రభాస్‌ని చూసే అని ఎవరిని అడిగినా చెబుతారు. రిలీజ్‌కి ముందు ప్రమోషన్ గట్టిగా చేసిన మంచు విష్ణు ఫస్ట్ వీకెండ్ తర్వాత కలెక్షన్లు చూసి ఇక పట్టించుకోవడం మానేశారు.

తాజాగా ‘కన్నప్ప’కి సంబంధించి ఓ న్యూస్ వైరల్‌గా మారింది. అది కూడా శివుడి పాత్రలో నటించిన అక్షయ్ కుమార్ గురించి. ఈ మూవీలో శివుడిగా నటించమని అడిగితే అక్షయ్ కుమార్ ముందుగా ఒప్పుకోలేదని.. కానీ మీరే ఆ క్యారెక్టర్ చేసి తీరాలని బ్రతిమాలితే అంగీకరించారని మంచు విష్ణు పలు ఇంటర్వ్యూల్లో చెప్పిన సంగతి తెలిసిందే. బాలీవుడ్‌లో ఎంతో క్రేజ్ ఉన్న అక్షయ్.. తొలిసారి తెలుగు సినిమాలో నటిస్తున్నారంటే కాస్త ఆసక్తి ఏర్పడింది. ఎలాంటి పాత్రలో అయినా ఒదిగిపోవడం, జయాపజయాలను పట్టించుకోకుండా సినిమాలు చేసుకుంటూ పోవడం ఆయన నైజం. అయితే ఇన్ని సినిమాలు చేసిన అక్షయ్ కుమార్ ‘కన్నప్ప’ సినిమాలో చేసిన మోసం ఇప్పుడు బయటకు వచ్చింది.

‘కన్నప్ప’ సినిమా కోసం అక్షయ్ కుమార్ రెండుసార్లు రిజెక్ట్ చేసినా మంచు విష్ణు పట్టుబట్టి మరీ ఓకే చేయించారు. దీంతో అయిష్టంగానే ఈ పాత్రని చేసిన ఆయన డైలాగులను ప్రాంప్టర్‌లో చూసి చెప్పారట. ‘కన్నప్ప’ వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతుండటంతో నెటిజన్లు ఈ విషయాన్ని పసిగట్టి ట్రోల్ చేస్తున్నారు. యాక్టర్లు డైలాగులు చెప్పేటప్పుడు నేరుగా కెమెరాని చూస్తారని, కానీ అక్షయ్ కుమార్ మాత్రం డైలాగులు చెబుతున్నప్పుడు కళ్లు పక్కకు తిప్పడం స్పష్టంగా కనిపిస్తోందని, దాన్ని బట్టి ఆయన టెలీ ప్రాంప్టర్ చూసి డైలాగులు చెబుతున్నారని కామెంట్లు చేస్తున్నారు. పవిత్రమైన శివుడి పాత్రలో నటిస్తూ కనీసం డైలాగులు నేర్చుకోలేదా... ఈ విషయాన్ని మేకర్స్ కూడా ఎందుకు పట్టించుకోలేదని నెటిజన్లు నిలదీస్తున్నారు. అక్షయ్ కుమార్ కళ్లు అటూ ఇటూ తిప్పుతున్నప్పుడు కెమెరామెన్ కూడా గమనించలేదా? అని ట్రోల్ చేస్తున్నారు. అయితే కొందరు మాత్రం ఇదంతా నిజం కాదని.. ‘కన్నప్ప’ని కావాలని కొందరు టార్గెట్ చేస్తున్నారని అంటున్నారు.



# ‘వీరమల్లు’తో జ్యోతి కృష్ణ ఫ్యామిలీ..

హరి హర వీరమల్లు కోసం జ్యోతి కృష్ణ ఎంతగా కష్టపడ్డారో అందరికీ తెలిసిందే. పవన్ కళ్యాణ్ హీరోగా ఏ ఎం రత్నం నిర్మాతగా క్రిష్ ఈ ప్రాజెక్ట్‌ని మొదలు పెట్టారు. కానీ జ్యోతి కృష్ణ ఈ ప్రాజెక్ట్‌ని హ్యాండిల్ చేయాల్సి వచ్చింది. కథ, కథనం అంతా మార్చి, తన విజన్‌ను తోడు చేసి హరి హర వీరమల్లుని భారీ స్థాయిలో తెరకెక్కించారు. ట్రైలర్ తరువాత వీరమల్లు మీద అందరికీ ఓ నమ్మకం ఏర్పడింది. వీరమల్లు కథ ఇదే అంటూ రకరకాలుగా ఊహించేసుకుంటున్నారు. ‘నా హృదయంలో ఎప్పటికీ నిల్చిపోయే క్షణం, చిత్రమిది.. కేవలం వృత్తిపరమైన జ్ఞాపకం మాత్రమే కాదు, ఇది జీవితకాలంలో ఒక అందమైన, అద్భుతమైన క్షణం.. మన గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారి పక్కన ఇలా హరిహరవీరమల్లు దర్శకుడిగా నిలబడటం ఇప్పటికీ నమ్మశక్యంగా అనిపించడం లేదు ... అది ఇప్పటికీ అవాస్తవంగా అనిపిస్తుంది. నాకు అన్ని రకాలుగా స్ఫూర్తిని ఇచ్చే వ్యక్తి పక్కన ఇలా నిలబడటం గర్వంగా ఉంది.. ఈ క్షణాన్ని చిరస్మరణీయంగా చేసే మరో విషయం ఇక్కడ ఉంది.. నా కుటుంబం ఇలా నాతో ఉంది, నా కుమార్తె అహానా కూడా ఇక్కడే ఉంది. ఈ రోజు ఆమె మొదటి పుట్టినరోజు.. ఆ రోజు మరిచిపోలేని జ్ఞాపకం.. కొన్ని ఫోటోలు కథలుగా మారుతాయి. ఇది నాకు ఒక వరంలా మారింది.. ఇలాంటి క్షణాలకు ఇచ్చిన పవన్ కళ్యాణ్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను’ అని అన్నారు. వీరమల్లు సినిమా నుంచి ప్రస్తుతం వస్తున్న ప్రతీ కంటెంట్ అంచనాల్ని పెంచుతున్న సంగతి తెలిసిందే. రీసెంట్‌గా వదిలిన వీరమల్లు టైటిల్ సాంగ్ అందరినీ ఆకట్టుకుంది. వీరమల్లు సినిమా కోసం ఫ్యాన్స్ ఇప్పుడు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. పాన్ ఇండియాకు సరిపడా కంటెంట్ ఉందని, యాక్షన్ సీక్వెన్స్ అదిరిపోయాయ్ అని, బీజీఎం కూడా సూపర్బ్‌గా ఉందని ట్రైలర్ చూసిన ప్రతీ ఒక్కరూ కాంప్లిమెంట్స్ ఇచ్చిన సంగతి తెలిసిందే.



# క్లారిటీ ఇచ్చిన నయనతార

విడాకుల ప్రచారంపై లేడీ సూపర్‌స్టార్ నయనతార క్లారిటీ ఇచ్చింది. తాజాగా భర్త విఘ్నేష్‌పై పడుకున్న ఫోటోని షేర్ చేస్తూ “మా గురించి పిచ్చి వార్తలు రాస్తే మా రియాక్షన్ ఇదే” అని నయనతార పోస్ట్ చేయడంతో విడాకుల వార్తలకి చెక్ పడినట్లయింది. నయనతార ప్రస్తుతం తెలుగులో చిరంజీవి, అనిల్ రావిపూడి చిత్రంలో నటిస్తోంది. 40 ఏళ్ల వయసులోనూ వరుస చిత్రాలతో దూకుడు మీదుంది లేడీ సూపర్‌స్టార్ నయనతార . తెలుగులో ప్రస్తుతం చిరంజీవి-అనిల్ రావిపూడి చిత్రంలో నటిస్తోన్న నయనతార తమిళం, కన్నడ, మలయాళ చిత్రాలతో బిజీగా ఉంది. గతంలో ఎంతోమందితో ప్రేమాయణాలు నడిపిన నయన్.. ఆ తర్వాత విఘ్నేశ్ శివన్‌ని పెళ్లాడి సరోగసీ విధానంలో కవల పిల్లలకు జన్మనిచ్చింది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా భర్త, పిల్లలతో తరుచూ వెకేషన్స్‌కి వెళ్తూ ఎంజాయ్ చేస్తుంటుంది. అయితే ఇటీవల భర్త తీరుతో నయనతార విసిగిపోయిందని, వీరిద్దరు విడాకులు తీసుకోబోతున్నారంటూ ప్రచారం జరుగుతోంది. నయనతార చేసిన పోస్ట్ దీనికంతటికీ కారణమైంది. ‘తెలివి తక్కువ వ్యక్తిని పెళ్లి చేసుకున్నప్పుడు పెళ్లి అనేది పెద్ద మిస్టేక్. నీ భర్త చేసే పనులకు నువ్వు బాధ్యత వహించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే పురుషులు సాధారణంగా మెచ్యూర్ కాదు. నన్ను ఒంటరిగా వదిలేయండి. నేను ఆల్రెడీ చాలా మీవల్ల ఫేస్ చేశా’ నయనతార ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టింది. ఆ పోస్ట్ నిమిషాల్లో వైరల్ కాగా కాసేపటికే ఆమె డిలీట్ చేసేసింది. అప్పటికే స్క్రీన్ షాట్‌ల రూపంలో ఆ పోస్ట్ వైరల్ కాగా.. నయనతార, విఘ్నేష్ శివన్‌ల మధ్య విభేదాలు తలెత్తాయని, త్వరలోనే విడాకులు తీసుకోబోతున్నారని ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారం అంతటికీ ఒకే ఒక్క ఫోటోతో చెక్ పెట్టేసింది లేడీ సూపర్‌స్టార్. విఘ్నేష్ శివన్ నేలపై పడుకుని ఉండగా ఆయనపై ఎక్కి పడుకున్న ఫోటోని షేర్ చేసిన నయనతార.. ‘మా గురించి కొన్ని పిచ్చి వార్తలు రాస్తున్నప్పుడు మా రియాక్షన్ ఇలాగే ఉంటుంది’ నయనతార చేసిన పోస్టుతో విడాకుల ప్రచారం అంతా ఫేక్ అని క్లారిటీ వచ్చేసింది. తాము ఎంతో అన్యోన్యంగా ఉన్నామని, ఎవరెన్ని ప్రచారాలు చేసినా కలిసే ఉంటామని స్పష్టత ఇచ్చింది. నయనతార చేతిలో ప్రస్తుతం పది సినిమాలు ఉన్నాయంటేనే ఆమె రేంజ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తెలుగులో అనిల్ రావిపూడి మెగాస్టార్ చిరంజీవి మూవీలో నటిస్తోన్న ఆమె ఈ చిత్రానికి గాను ఏకంగా రూ.18 కోట్ల రెమ్యునరేషన్ తీసుకుంటున్నట్లు టాక్.



# ‘నాకూ చాలా బుల్లెట్లు తగిలాయి..

‘ఒక నారి వంద తుపాకులు’.. యాంకర్ ఉదయభానును ఉద్దేశించి దర్శకుడు మచ్చ రవి ఈ మాట అన్నప్పుడు.. ‘నాకూ చాలా బుల్లెట్లు తగిలాయి.. అది ఎవరికీ తెలియదు’ అని అన్నది యాంకర్ ఉదయభాను. ఈ సందర్భంలో ఇండస్ట్రీలో ఉన్న యాంకర్ల సిండికేట్ గురించి హాట్ కామెంట్స్ చేసింది. సుహాస్ హీరోగా నటించిన.. ‘ఓ భామ అయ్యో రామ’ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో యాంకర్ ఉదయభాను చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.



పోటీ ప్రపంచంలో పోటీ పడని రంగం అంటూ ఏమీ లేదు. ముఖ్యంగా క్రియేటివ్ అండ్ ఎంటర్ టైన్మెంట్ ఫీల్డ్‌లో కూడా ఎవరు ముందుంటే వాళ్లదే పైచేయి. మా బాబులు గొప్పోలు.. మాకు దండాలు పెట్టండి.. భజనలు చేయండి అంటే దొబ్బడం లేదు. అలాగే నేను అంత సీనియర్ ఇంత సీనియర్‌ని.. నాకు అంత బ్యాగ్రౌండ్ ఉందీ.. ఇంత బ్యాగ్రౌండ్ ఉంది అని అంటే.. నీ గ్రౌండ్‌లో నువ్వే ఆడుకో.. మేం దూసుకుని పోతాం అని ముందుకెళ్లిపోతున్నారు. ఇప్పుడు అన్ని రంగాల్లో పోటీ ఉన్నట్టే యాంకరింగ్‌లో బీభత్సమైన పోటీ వచ్చేసింది. ఒకప్పుడు ఏదైనా ఆడియా ఈవెంట్ జరిగినా.. సినిమా ఫంక్షన్ జరిగినా.. మరే ఇతర టీవీ షో అయినా ఎక్కువగా వినిపించే పేరు యాంకర్ ఉదయభాను . అబ్బబ్బా వన్స్ మోర్ ప్లీజ్.. ప్లీజ్ వన్స్ మోర్ అంటూ అంటూ డాన్స్ బేబీ డాన్స్‌ని అల్లాడించాలన్నా.. సాహసం చేయరా డింబకా అంటూ జనంలోకి వచ్చి ఆటాడించాలన్నా ఆమె తరువాతే ఇంకెవరైనా. ఇక చిన్ని చిన్న సినిమా ఈవెంట్లు, ప్రెస్ మీట్‌లలో ఈ మధ్య యాంకర్ స్రవంతి పేరు గట్టిగా వినిపిస్తుంది. ఆమె యాంకర్ సుమలా మాట్లాడకపోయినా.. గ్లామర్ షోతో వచ్చిన వాళ్లని ఆకట్టుకుంటోంది కాబట్టి.. ఆమెకి డిమాండ్ బాగానే పెరిగింది. ఇక ఆమెతో పాటు.. మరికొంతమంది యాంకర్లు అక్కడక్కడా కనిపిస్తుంటారు. అయితే ఉదయభాను రేంజ్‌లో హోస్ట్ చేయలేకపోయినా కూడా వాళ్లకే ప్రాధాన్యత ఇస్తున్నారు తప్పితే.. ఉదయభాను ఊసెత్తడం లేదు.